అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :226 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 13-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## బండ్లగూడలో దారుణం...భార్యను చంపిన భర్త

హైదరాబాద్,పాతబస్తీ బండ్లగూడలో దారుణం జరిగింది. భార్య గొంతుకోసి హత్య చేసి మృతదేహాన్ని తగులబెట్టాడు ఓ భర్త. ఈ సంఘటన మంగళవారం తెరపైకి వచ్చింది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.భార్య ఖమర్ బేగం ను దారుణంగా హతమార్చాడు భర్త ఫైజ్ ఖురేషి. అనంతరం మృతదేహాన్ని తగలబెట్టాడు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.మనస్పర్థల కారణంగా భార్య తో తరుచూ గొడవ పెట్టుకునేవాడు భర్త ఫైజ్ ఖురేషి.అయితే%ొ% గత అర్ధరాత్రి మరోసారి ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ తరుణంలోనే భార్య ఖమర్ పై కత్తితో దాడి చేసి గొంతు కోశాడు భర్త ఫైజ్ ఖురేషి. అనంతరం మృతదేహాన్ని తగలబెట్టి అగ్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు భర్త ఫైజ్ ఖురేషి.. అయితే%ొ% చుట్టుపక్కల వాళ్ళు రావడంతో.. నేరుగా పోలీస్ స్టేషన్ వెళ్ళి లొంగిపోయాడు భర్త ఫైజ్ ఖురేషి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుల ఇష్టప్రకారమే భూసేకరణ జరగాలి..



హైదరాబాద్: భూసేకరణ రైతుల ఇష్టప్రకారం జరగాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ (ఈటెల రాజేందర్) అన్నారు. కొడంగల్ చుట్టుపక్కల మండలాల్లో ఇంటర్నెట్ సేవలు, కరెంటు బంద్ చేసి వందల మంది పోలీసులను గ్రామాల్లో మోహరించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కలెక్టర్, అధికారులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, అయితే రైతులపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని. భూసేకరణ రైతుల ప్రకారం జరగాలి తప్ప.. బలవంతంగా అధికారం ప్రభుత్వానికి అందజేయాలి. గతంలో ముచ్చర్లలో ఫార్మా సిటీ కోసం భూములు సేకరించినప్పుడు ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న ఇదే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించదని ఆయన గుర్తుచేశారు. అప్పుడు వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు భూములు గుంజుకుని రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులపై దాడిని ఖండిస్తున్నామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. దుద్యాల ఘటన వెనుక రాజకీయ కుట్ర ఉందని చెప్పారు. దాడి వెనుక ఎవరున్నా సహించేది లేదని చెప్పారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఢిల్లీలో ఫిర్యాదులతో కెటిఆర్ హైడ్రామా



న్యూఢిల్లీ,నవంబర్12: మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు కెటిఆర్ ఢిల్లీ మెట్లెక్కారు. బిజెపిపై నమ్మకం లేదంటూనే, అదే ప్రభుత్వానికి జఫిర్యాదులు మోసుకెళ్లారు. తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ పదకొండు నెలల రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని ఆయన వలపోస్తున్నారు. ఈక్రమంలో ఢీల్లీకి వెళ్ల అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదిరాల్లో అవినీతి గుప్పుమంది. మొత్తంగా ఇన్ని రోజులు తెలంగాణకే పరిమితమైన కుంభకోణాల రాజకీయం ఇప్పుడు ఢిల్లీ చేరింది. తెలంగాణకు చెందిన కీలకమైన ముగ్గురు వ్యక్తులు హస్తినలో మకాం వేసారు. ఎవరి పనుల మీద వారు ఢిల్లీ వెళ్లినా రాజకీయ కోణంలో కొంత ఆసక్తి కలుగుతోంది. రాజకీయం ఎప్పుడు ఎలాంటి మలుపు తీసుకుంటుందో చెప్పలేం. ఇప్పటికే రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫిర్యాదు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి హస్తిన వెళ్లారు. మరోవైపు గవర్నర్ ఢిల్లీ పర్యటన అనేక చర్చలకు దారి తీస్తోంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వస్తామని అన్నారు. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి హడావిడి చేస్తున్న సమయంలోలోనే సీఎం రేవంత్ రెడ్డి కూడా మగంళవారం ఢిల్లీ పర్యటన ఆసక్తిని రేపుతోంది. దీపావళి తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో చాలా పెద్ద చర్చ జరుగుతోంది. మరోవైపు త్వరలోనే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఈ అభ్యర్థులను కూడా ఖరారు చేయాల్సి ఉంది. వీటితోపాటు ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్షం బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఇప్పుడు ఏకంగా కేంద్రమంత్రులకే ఫిర్యాదులు కూడా చేసింది. ఇన్ని అంశాలు ప్రచారంలో ఉండగా ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లడం ఆసక్తిని కలిగిస్తోంది. కేవలం అధిష్టానం పెద్దలను కలవడానికే ఢిల్లీకి వస్తున్నారని అందరికీ తెలిసిందే. ఈ మధ్య మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్ ఆ విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికి ఏమైనా ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష ఎమ్మెల్యే కేటీఆర్ ఢిల్లీలో ఉండగానే తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఢిల్లీ వెళ్లడం చర్చనీయాంశం అవుతోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేం దుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు దర్యాప్తు సంస్థలు విన్నవించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. ఈ విషయంపై ఇంకా గవర్నర్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఈ అంశంపై క్లారిటీ కోసం ఢిల్లీ వెళ్లారా లేకుంటే సాధారణంగా వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మొత్తంగా రేవంత్‌పై ఆరోపణలతో తమ తప్పులను కప్పిపుచ్చుకునే భారీ యత్నాల్లో కెటిఆర్ ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకోవడానికే వెళ్లారని మంత్రులు పొన్నం, పొంగులేటిలు ఇప్పటికే ఆరోపించారు.

# నేడు జార్ఖండ్ తొలిదశ పోలింగ్...వయనాడ్‌లో అదృష్టం పరీక్షించుకుంటున్న ప్రియాంక



న్యూఢిల్లీ,నవంబర్12: రెండు రాష్ట్రాలతో పాటు, పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. నేటినుంచే అంటే బుదవారం నవంబర్ 13న జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలదశ పోలింగ్ జరగనుంది. తొలి విడత ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 6గంటలతో నిలిచిపోయింది. తొలి దశలో రాష్ట్రంలోని 43 స్థానాలకు పోలింగ్ జరగనుంది. 683 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1.37 కోట్ల మంది ఓటర్లు నిర్ణయిస్తారు. 950 పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓట్లు వేయనున్నారు. పోలింగ్ సిబ్బందిని హెలిడ్రాపింగ్ ద్వారా 194 పోలింగ్ కేంద్రాలకు తరలించారు. దీనితో పాటు, కర్ణాటకలోని 3 అసెంబ్లీ స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని బుద్ని, విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానాలు, అస్సాంలోని 5 అసెంబ్లీ స్థానాలు, రాజస్థాన్‌లోని 7 అసెంబ్లీ స్థానాలు, కేరళలోని చెలక్కర అసెంబ్లీ స్థానం, వాయనాడ్ లోక్‌సభ స్థానాలకు కూడా ఎన్నికల ప్రచారం ముగిసింది. కేరళలోని వాయనాడ్ లోక్‌సభ, చెలక్కర అసెంబ్లీ స్థానాలకు ఇదేరోజు ఉప ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రెండు చోట్లా నవంబర్ 13న పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాయనాడ్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె ముందు ఎల్‌డీఎఫ్ సత్యన్ మొకెరిని అభ్యర్థిగా నిలబెట్టారు. నవ్య హరిదాస్‌ను బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. వాయనాడ్‌లో ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రియాంక గాంధీ సుడిగాలి పర్యటన నిర్వహించారు. 35 సంవత్సరాలుగా ప్రచారం చేస్తున్నానని, అయితే ఇది తన జీవితంలో అత్యంత సంతోషకరమైన ప్రచారమని ప్రియాంక అన్నారు. వయనాడ్‌లో ఎక్కడికి వెళ్లినా, తనకు అపారమైన ప్రేమ లభించిందని, ప్రచారమంతా ప్రజల ప్రేమ తనలో శక్తిని నింపిందన్నారు. కేరళవాసుల గొంతుకగా పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రియాంక అన్నారు. కలిసిన ప్రతి వ్యక్తి తనకు స్ఫూర్తినిచ్చారని, వాయనాడ్‌లో భారతదేశ సౌందర్యాన్ని చూశానన్నారు. మా అన్నయ్యను విడిచిపెట్టడం బాధగా ఉన్నప్పటికీ, అంకితభావంతో వాయనాడ్ ప్రజల కోసం పోరాడటానికి ఇక్కడకు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు ప్రియాంక.కర్ణాటకలోని షిగ్గావ్, చన్నపట్న, సందూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో అయా నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది. షిగ్గాంలో 8 మంది, చన్నపట్నంలో 31 మంది, సందూర్‌లో 6 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. షిగ్గావ్ నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్‌ను బీజేపీ పోటీకి దింపింది. కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్ పై భరత్ పోటీ చేస్తున్నారు. సందూర్‌లో బంగారు హనుమంత్‌ను బీజేపీ అభ్యర్థిగా నిలబెట్టింది. ఆయన కాంగ్రెస్‌కు చెందిన అన్నపూర్ణతో తలపడుతున్నారు. అదే సమయంలో ఎన్డీయే మిత్రపక్షం జేడీఎస్ చన్నపట్నం నుంచి నిఖిల్ కుమారస్వామిని బరిలోకి దింపింది. ఆయన కాంగ్రెస్ సీనియర్ నేత సీపీ యోగీశ్వర్‌తో తలపడనున్నారు. ఇకపోతే బుధవారమే నవంబర్ 13న మధ్యప్రదేశ్‌లోని బుద్ని, విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఎన్నికల ప్రచారాన్ని సోమవారం సాయంత్రం 6 గంటలకు నిలిపివేశారు. విదిశా మాజీ ఎంపీ రమాకాంత్ భార్గవను బుద్నీ నుంచి బీజేపీ పోటీకి దింపింది. ఆయన ముందు కాంగ్రెస్ మాజీ మంత్రి రాజ్‌కుమార్ పటేల్ ఉన్నారు. విజయ్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి రాంనివాస్ రావత్ కాంగ్రెస్ సీనియర్ నేత ముఖేష్ మల్హోత్రాతో తలపడుతున్నారు. నవంబర్ 13న అస్సాంలోని 5 స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో వీటిలో ప్రచారం నిలిచిపోయింది. ఉప ఎన్నికలు జరగనున్న స్థానాలు ధోలై (రిజర్వ్‌డ్), సిడ్లీ (రిజర్వ్‌డ్), బెహాలి, బొంగైగావ్ మరియు సంగురి. ఈ స్థానాలకు మొత్తం 34 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ధుబ్రీ ఎంపీ రకీబుల్ హుస్సేన్ కుమారుడు తంజీల్‌ను సంగురి స్థానానికి కాంగ్రెస్ పోటీ చేసింది. ఆయన కంటే ముందు డిప్లో రంజన్ శర్మకు బీజేపీ టిక్కెట్టు ఇచ్చింది. రాజస్థాన్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో అయా నియోజకవర్గాల్లో ప్రచారం నిలిచిపోయింది. ఝుంఝును, దౌసా, ఖిన్వ్సర్, డియోలి-ఉనియారా, సాలంబెర్, చౌరాసి మరియు రామ్‌గఢ్ ఎన్నికలు జరగనున్న స్థానాలు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత, నిశ్శబ్ద సమయంలో, అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఇంటింటికీ వెళ్లి మాత్రమే, ఓటు వేయమని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తంగా ఈ ఎన్నికలు అటు బిజెపికి, ఇటు కాంగ్రెస్ కూటమికి పరీక్ష లాంటివే.

# అయోధ్య పునాదులు పెకిలిస్తాం.. ఖలిస్తానీ ఉగ్రవాది బెదిరింపులు



న్యూఢిల్లీ, సిఖ్స్ ఫర్ జస్టిస్ అధినేత, ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ మరోసారి బెదిరింపు లకు దిగాడు. ఆ బెదిరింపులకు సంబంధించిన వీడియోను విడుదల చేశాడు. ఉత్తర్‌ప్రదేశ్ అయోధ్య రామ మందిరం సహా.. దేశంలోని హిందూ దేవాలయాలపై ఈనెల 16, 17వ తేదీల్లో దాడులు చేయనున్నట్లు తీవ్రమైన హెచ్చరికలు చేశాడు.ఇక అయోధ్యలోని దివ్య రామమం దిరాన్ని పునాదులతో సహా పెకిలించి కూల్చేస్తామని పన్నూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు.

అయోధ్య పునాదులను..

దేశంలోని హిందూ ఆలయాలే లక్ష్యంగా ఈ బెదిరింపులు చేస్తూ.. మరో వీడియోను విడుదల చేశాడు. హింసాత్మక హిందుత్వ భావజాలానికి పుట్టినిల్లు అయిన అయోధ్య పునాదులను పెకిలిస్తామంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశాడు. ఇక ఆ వీడియోలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలను కూడా ప్రదర్శించాడు. నవంబరు 16, 17వ తేదీల్లో ఆలయాలపైన దాడులు జరుగుతాయంటూ గురుపత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరికలు జారీ చేశాడు. అంతేకాకుండా ఆలయాలపై ఖలిస్థానీ మద్దతుదారులు దాడులు చేసేటపుడు దూరంగా ఉండాలంటూ కెనడాలోని హిందువులపైనా బెదిరింపులకు దిగాడు. ఇటీవలె కెనడాలోని బ్రాంప్టన్ నగరంలో ఉన్న ఆలయ కాంప్లెక్స్‌లోకి చొరబడిన ఖలిస్థానీ మద్దతుదారులు రెచ్చిపోయారు. అక్కడ ఉన్న హిందూ భక్తులపై ఖలిస్థానీ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. అయితే అదే బ్రాంప్టన్ నగరంలోనే గురుపత్వంత్ సింగ్ పన్నూ తాజాగా వీడియోను రికార్డు చేసి విడుదల చేసినట్లు తెలుస్తోంది.అయితే గురుపత్వంత్ సింగ్ పన్నూ తాజా హెచ్చరికలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక ఈ వీడియోను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రాజకీయాల్లో ఉగ్రవాదులకు చోటు కల్పిస్తున్నారని కెనడాపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఇక ఇప్పటికే గురుపత్వంత్ సింగ్ పన్నూ అనేక బెదిరింపులకు దిగాడు. అంతేకాకుండా ఈ ఏడాది జనవరిలో అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ సమయంలో కూడా దాడులు చేస్తామని హెచ్చరికలు చేశాడు.కొద్ది రోజుల క్రితమే పన్నూ నవంబర్ 1 నుంచి 19 వరకు ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించొద్దంటూ వార్నింగ్ ఇచ్చాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు జరిగిన సందర్భంగా ఎయిరిండియా విమానాలపై దాడి జరిగే అవకాశాలున్నాయని పన్నూ పేర్కొన్నాడు. మరోవైపు హిందూ దేవాలయాలపై ఖలిస్తాన్ దాడులకు దూరంగా ఉండాలని కెనడాలోని భారతీయులను కూడా పన్నూన్ హెచ్చరించాడు. నవంబర్ 19వ తేదీన ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మూసివేస్తారని.. భవిష్యత్తులో ఆ ఎయిర్‌పోర్టు పేరు కూడా మారుతుందని పేర్కొన్నాడు.

# జమిలి ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధం: సీపీఐ నేత నారాయణ



హైదరాబాద్: రాజకీయాల్లో దుష్ట సంస్కృతిని ప్రధాని మోదీ తీసుకొచ్చారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికలను ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని చెప్పారు. ఆ రెండు రాష్ట్రాల్లో గెలిస్తే జమిలి ఎన్నికల దిశగా వెళ్లాలని మోదీ చూస్తున్నారన్నారు. ఆ ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధమని చెప్పారు. మఖ్దూం భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలో కూటమి పొత్తులో భాగంగా ఒక స్థానంలో పోటీ చేస్తున్నామని.. ఝార?ండ్‌లో ఒంటరిగా బరిలో నిలిచామని నారాయణ తెలిపారు. వైకాపా అధ్యక్షుడు జగన్ 12 ఏళుగా బెయిల్‌పై ఉన్నారన్నారు. కోర్టులకు కూడా ఆయన వెళ్లడం లేదని ఆక్షేపించారు. మోదీ, అమిత్‌షా సహకారంతోనే జగన్ బయట ఉన్నారని ఆరోపించారు. తెలంగాణలో కులగణనపై నారాయణ స్పందించారు. దీనిద్వారా రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడినవారిని ప్రోత్సహించవచ్చని.. కానీ దీనికి 75 ప్రశ్నలు అవసరమా? అని ప్రశ్నించారు. యాప్ రూపొందిస్తే ఎవరి ఫామ్ వాళ్లే పూర్తి చేస్తారన్నారు. వ్యక్తిగత ఆస్తులు, అప్పులు, బ్యాంకు లావాదేవీలు ప్రభుత్వానికి ఎందుకన్నారు. వివాదం కాకుండా కులగణన సులభతరం చేయాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, అధికారులపై గ్రామస్థులు ఆవేదనతో దాడి చేశారని.. తమ భూములు పోతాయనే ఆవేదనతోనే వారు అధికారులను అడ్డుకున్నారన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి : ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



మహబూబాబాద్, సీఎం రేవంత్ రెడ్డి(సీఎం రేవంత్ రెడ్డి) సొంత నియోజకవర్గ కొడంగల్‌లోని లెగచెర్లలో గిరిజనులపై పోలీసులు దాడులు చేయడం అమానుషమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్(సత్యవతి రాథోడ్)అన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో 13వేల ఎకరాల భూమి ఉండగా, ఇక్కడ కాదని కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా కంపెనీ తీసుకొచ్చేందుకు రేవంత్ రెడ్డి ఎందుకు ఆరాటపడుతున్నారని ఆమె ప్రశ్నించారు.పచ్చని పొలాల మధ్య ఫ్యాక్టరీ పెట్టడం వల్ల పొల్యూషన్‌తో చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఇబ్బంది వాటిల్లుతుందని నిన్న అధికారులు పోతే రైతులు అడ్డుకున్నారు. రైతుల బాధలను అర్థం చేసుకోకుండా అర్ధరాత్రి పోలీసులు వేల సంఖ్యలో వెళ్లి గిరిజనులను అరెస్టు చేసి కొట్టడాన్ని కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నాం. నీ సొంత నియోజకవర్గంలోనే రైతులను మెప్పించలేని రేవంత్ రెడ్డి రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలను ఎలా మెప్పిస్తారని ఆమె సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజలు చేసుకున్న పాపమా అని నిలదీశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు.రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత 11 నెలల కాలంలో ఇప్పటికీ 25 సార్లు ఢిల్లీ వెళ్లారని. ప్రజల సమస్యలు పక్కకు పెట్టి హైదరాబాద్ నుంచి ఢిల్లీ చెక్క, ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కుర్లు కొట్టడమే సరిపోతుందని తెలుస్తోంది. ఇప్పటికైనా లగచర్లలోని గిరిజన రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం అని ఆమె అన్నారు.

# వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న హరీశ్ రావు



రాజన్న సిరిసిల్ల : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు హరీశ్ రావుకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, మంగళవారం కోరుటల్లో ఉదయం 8 గంటలకు కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే రైతు పాదయాత్ర వెంకటాపూర్, మేడిపల్లి, తాటిపెల్లి, చల్‌గల్ మీదుగా జగిత్యాలకు చేరుకోనున్నది. చల్‌గల్ సమీపంలో హరీశ్ రావు పాదయాత్రకు సంఘీభావం తెలియజేసి, అక్కడి నుంచి జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చి సమావేశం నిర్వహించనున్నారు.

## బావిలోకి దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా పరిగి కుధావన్ పూర్ లో విషాదం చోటుచేసుకుంది. మానసిక క్షోభతో తల్లీ కూతుళ్లు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులు తల్లి లలిత, కూతురు భవానీగా గుర్తించారు. ఎనిమిదేళ్ల క్రితం లలిత భర్తను చనిపోయాడు. ఈ ఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు

గుంటూరు, మొక్కుబడిగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి భారీగా ఆంక్షలు విధించడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసిఐ తీరుపై రైతులు, రైతు సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించినా రూ.5,500 దాటి కొనడం లేదు. ఈ ఏడాది ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ పెట్టుబడి అయిందని చెప్పారు. ఎకరాకు కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి వస్తే కొంతవరకు కోలుకుంటామని, ఇటీవల కురిసిన అధిక వర్షాలకు బాగా నష్టం వాటిల్లిందని తెలిపారు. తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉంటేనే సిసిఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేస్తున్నారని, 12 శాతం దాటితే వెనక్కి పంపిస్తున్నారని రైతులు చెప్తున్నారు. ఎ÷-లాస్టిక్ గోతాల్లో కాకుండా లూజుగా పత్తి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆంక్షలు విధిస్తున్నారు. తేమ శాతం 18 శాతం ఉన్నా కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. సిసిఐ నిబంధనలు కఠినంగా ఉన్నాయని, వాటిని వెంటనే సడలించాలని ఎపి రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజరుకుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 80 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వాటిలో కేవలం 12 జిన్నింగ్ మిల్లుల్లోనే సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు వచ్చిన వారికి ఆంక్షలు తీవ్ర ఆటకంగా మారాయి. సిసిఐ ఆంక్షలను సాకుగా చూపి దళారులు పెద్ద ఎత్తున రంగప్రవేశం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వాతావరణంలో మార్పులతో పత్తి నాణ్యత తగ్గిందంటున్నారు. ప్రధానంగా తేమ శాతం 12 శాతం మించరాదని సిసిఐ నిబంధన విధించింది. ప్రస్తుతం 18 నుంచి 20 శాతం వరకు తేమ ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో, రైతులు పత్తిని ఆరబెట్టుకుని ఇళ్లలో నిల్వ చేసుకోవడం ఇబ్బందిగా మారింది. ఆరబెట్టుకోవడానికి, నిల్వ చేసుకోవడానికి స్థలం లేక పొలం నుంచి ఇంటికి తీసుకొచ్చిన వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మద్దతు ధరకు కొనేనాధుడు కరువయ్యాడు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 4.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా, ఈ ఏడాది విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గుంటూరు జిల్లాలో 53,500, పల్నాడు జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. మొత్తంగా దాదాపు 50 శాతం విస్తీర్ణంలో సాగు తగ్గినా ధర పెరగడం లేదు. ఎకరాకు సగటున 15 క్వింటాళ్లు ఉత్పత్తి వస్తుందని ఆశించినా ఈ ఏడాది పది క్వింటాళ్లు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడులతో క్వింటాలుకు రూ.10 వేలు ధర ఉంటే తప్ప గిట్టుబాటు కాదని పెదకూరపాడు రైతు ఎం.రామారావు తెలిపారు.

# నిరుపేదలకూ నికార్సైన వైద్యం



హైదరాబాద్,ఐటి రంగంలో బెంగళూరు తర్వాత ద్వితీయ స్థానాన్ని అందిపుచ్చుకున్న భాగ్యనగరం, వైద్య రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. దేశంలోనే అత్యుత్తమ వైద్యసేవలు అందించే నగరాల్లో ఒకటిగా ఇప్పటికే పేరు సంపాదించుకుంది. దేశవిదేశాల నుంచి ఇక్కడకు తరలివచ్చే రోగులే ఇందుకు నిదర్శనం. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న వినూత్నమైన మార్పులను అవగాహన చేసుకుంటూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అవపోసన పడుతూ– పుట్టలకొద్దీ పుట్టుకొస్తున్న కొత్తరకం వ్యాధులను అరికట్టేందుకు ఇక్కడి వైద్యులు నిరంతరం శ్రమిస్తున్నారనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో వైద్యపరంగా రెండు వినూత్నమైన పరిణామాలకు హైదరాబాద్ కేంద్రబిందువుగా మారడం హర్షించదగిన విషయం. ఇందులో ఒకటి ఇకపై శస్త్రచికిత్స ద్వారా చేతుల మార్పిడి కూడా సాధ్యమేనంటూ అపోలో ఆస్పత్రి వైద్యులు ముందుకు రావడం. రెండవది– జీర్ణకోశ వ్యాధులకు దారితీస్తున్న హెచ్. పైలోరి అనే బ్యాక్టీరియాపై విస్తృత పరిశోధనలు సాగించేందుకు వీలుగా ఓ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటుకు ఏషియన్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఎఐజి) ఆస్పత్రి యాజమాన్యం పూనుకోవడం. బ్రెయిన్ డెడ్ అయిన రోగులనుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి అవయవాలను సేకరించి, వాటిని బతికున్న రోగులకు అమర్చడమే తప్ప, వైద్యపరంగా చేతుల మార్పిడి ప్రక్రియ అసాధ్యమని అందరూ భావిస్తున్న తరుణంలో అపోలో వైద్యులు ఇది సులభసాధ్యమేనని భరోసా ఇవ్వడం వైద్యరంగంలో ఒక కీలక పరిణామంగా చెప్పుకోవచ్చు.ముక్కలుగా తెగిపడిన చేతి భాగాలను కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో అతికించవచ్చుంటూ వారు చెబుతున్న మాటలు.. చేతులు లేని లేదా ప్రమాదంలో చేతులు కోల్పోయిన వేలాది మందికి భరోసా ఇస్తాయనడంలో సందేహం లేదు. అయితే బ్రెయిన్ డెడ్ అయిన రోగుల బంధువుల నుంచి సహకారం అందితే తప్ప డాక్టర్లు చేయగలిగిందేమీ ఉండదు. ఈ దిశగా ఇప్పటికే అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు విశేషమైన కృషి చేస్తున్న జీవన్ దాన్ వంటి సంస్థలు ఇకపై చేతుల దానానికీ నడుం బిగించవలసి ఉంటుంది. బ్రెయిన్ డెడ్ అయినవారి చేతులను దానం చేస్తే, మరణానికి చేరువైన తమ బంధువుకు చేతులు లేవనే భావన కుటుంబ సభ్యులలో కలగకుండా ఉండేందుకు కృత్రిమ చేతులను అమర్చుతామన్న అపోలో వైద్యుల హామీ ఎంతో ఉదాత్తమమైనది. ఇక రెండో విషయానికొస్తే, ఉదర సంబంధిత వ్యాధులు వస్తే చికిత్స కోసం ఆస్పత్రులకు పరుగు పెట్టడంతప్ప ఆ వ్యాధులు దేని వల్ల కలుగుతున్నాయనే అవగాహన సాధారణ ప్రజానీకానికి ఉండదు. ఈ నేపథ్యం లో మన దేశంలో దాదాపు 50 -60 కోట్ల మంది ప్రజలు హెచ్. పైలోరీ బ్యాక్టీరియా వలన కలిగే వ్యాధులబారిన పడుతున్నారంటూ నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బారీ మార్షల్ చెప్పిన మాటలు వింటే వెన్నులో వణుకు పుట్టక మానదు. అల్సర్లు, ఉదరకోశ క్యాన్సర్లకు ఈ బ్యాక్టీరియానే కారణమంటున్న ఆయన, 90 శాతం చిన్నపిల్లలకు తల్లి ద్వారానే ఈ సూక్ష్మక్రిములు సోకుతాయంటున్నారు. హెచ్-పైలోరీ బ్యాక్టీరియాపై పరిశోధనల కోసం తన శరీరాన్నే ఒక ప్రయోగశాలగా మార్చుకున్న త్యాగధనుడు డాక్టర్ మార్షల్ పేరును బ్యాక్టీరియాపై విస్తృత పరిశోధనల కోసం ఎఐజి ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటు చేసిన రీసెర్చి సెంటర్‌కు పెట్టడం ఎంతయినా సమంజసం. భారతదేశం నిరుపేదలకు పుట్టినిల్లు. దాదాపు 145 కోట్ల దేశ జనాభాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్యే అధికమనడంలో సందేహం లేదు. రెండు పూటలా కడుపు నింపుకోవడమే గగనంగా మారిన ఇలాంటి మోడువారిన జీవులకు పౌష్టికాహారం దొరకదు సరికదా రోగాలు రొష్టులు వస్తే చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించవలసిందే తప్ప మరో దారి ఉండదు.కాబట్టి, వైద్య రంగం లో వెలుగు చూస్తున్న సరికొత్త ఆవిష్కరణలు ఇలాంటి అభాగ్యజీవులకు అందినప్పుడే వాటికి ఫలితం ఉంటుంది. ఖరీదైన వైద్యానికి నోచుకోని పేదలకు సరికొత్త చికిత్సా విధానాలు అందాలంటే, వైద్యరంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను, ఆధునిక శస్త్ర చికిత్సా విధానాలను ప్రభుత్వ ఆసుపత్రులు కూడా అందిపుచ్చుకోవాలి. ఇందుకు తగిన రీతిలో ఆసుపత్రులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలకు చిరునామాగా మారుతున్న భాగ్యనగరంలోని కార్పొరేట్ ఆస్పత్రులు సరికొత్త వైద్య విధానాలను, చికిత్సా పద్ధతులను పేదలకు చేరువ చేయడంలో చొరవ చూపాలి. అప్పుడే వైద్యో నారాయణో హరిః అనే నానుడికి సార్థకత.

# వ్యవసాయానికి సీఎం చంద్రబాబు పెద్దపీట

అమరావతి: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో వ్యవసాయ రంగానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తూ దూసుకెళ్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతు కుటుంబాల్లో సంతోషం నింపాలని ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి చెప్పారు. అందుకు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అచ్చెన్న తెలిపారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రి అచ్చెన్న ప్రసగించారు. ముందుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అందులో భాగంగా రూ.43,402.33 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. "ప్రముఖ కవి గుర్రం జాషువా రైతు గురించి రాసిన పద్యంతో వ్యవసాయ బడ్జెట్ ప్రారంభించడం సముచితంగా భావిస్తున్నా. రైతుల పరిస్థితి మారాలని, రైతే రాజు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారు. ఆరుగాలం ఇంటిల్లిపాదీ శ్రమించి ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నకు మనసా, వాచా, కర్మనా శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేస్తున్నా. అంధకారం అనే అగాధంలో పడిపోతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నడిపించేందుకు దార్శనికత కలిగిన నాయకుడు కావాలనే ప్రజలు చంద్రబాబును గెలిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక లాంటిది. ఏపీలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై 62 శాతం మంది ప్రజలు ఆధారపడ్డారు. గత ఐదేళ్లపాటు భూసార పరీక్షలను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. కనీసం వారు రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించలేదు. వైసీపీ హయాంలో రబీ కాలంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదు. రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో బాధ్యతను గాలికి వదిలేశారు. గతేడాది కరవు ప్రాంతాల్లో పంటల బీమా అందించాలనే విచక్షణను వైసీపీ మరిచింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతు అభ్యున్నతే లక్ష్యంగా భావించింది. అందుకే వ్యవసాయ రంగానికి సంబంధించి అనేక చర్యలు చేపట్టింది. భూసార పరీక్షా పత్రాల జారీ, పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు చేపట్టాం. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన, శిక్షణ కల్పిస్తున్నాం. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు బాగా కురిసి పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ సాయం పెంచాం. ఆ రైతులకు నెల రోజుల్లోనే నగదు చెల్లించేందుకు కంటి మీద కునుకు లేకుండా పని చేశాం" అని తెలిపారు.

# ప్రజా వంచన..

న్యూఢిల్లీ,వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. పడికట్టు పదాలు బాగా అలవాటు చేసుకున్నారు. అభివృద్ధి పేరుతో నయవంచన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేదని,కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధం లోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించా ల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆర్థిక మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం కూడా బలంగా ఉంది. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకో వచ్చు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలి స్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నా మంటేనే.. ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ధి పొందారని గర్వంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. అయితే పాలకులు సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని మోడీ సహా నేతలంతా పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్న మాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నా మంటున్నారు. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోడీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. ఇల్లు కొనుక్కోగలిగే పరిస్థితులు లేకుండా చేశారు.

# ఆ జిల్లాలో ఏం జరుగుతోంది?



అమరావతి, టీడీపీ నేతలపై ఆ వైసీపీ నేతకు ఉన్నట్లుండి ఒక్కసారిగా ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు చిగురించాయి. ఏకంగా ఆ నేతలకు సంఘీభావంగా ట్వీట్ కూడా చేశారు ఆ వైసీపీ నేత. వారికి అన్యాయం జరుగుతోంది.. నేను ఒప్పుకోననే రీతిలో ఆ నేత ట్వీట్ చేసిన తీరుకు సొంత పార్టీ నేతలే షాకయ్యారట. ఇంతకు ఆ నేత ఎవరో తెలుసా.. సాక్షాత్తు వైసీపీ నేత విజయసాయిరెడ్డి.మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడప. ఈ జిల్లాలో ఎన్నికల వేళ ప్రజలు ఇచ్చిన తీర్పు వైసీపీకి షాక్ అని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లా పరిధిలో కేవలం 3 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే వైసీపీకి దక్కాయి. మిగిలిన సీట్లన్నీ టీడీపీ కూటమి సొంతమయ్యాయి. జిల్లా కేంద్రమైన కడప నియోజకవర్గం కూడా టీడీపీ వశమైంది. 2019 ఎన్నికలలో వైసీపీ క్లీన్ స్వీప్ చేయగా, 2024 ఎన్నికలకు మాత్రం టీడీపీ కూటమి హవా సాగింది. అయితే ఎంతైనా మాజీ సీఎం జగన్ స్వంత జిల్లా కావడంతో, ఈ ఫలితాలు కొంచెం వైసీపీకి మింగుడు పడని పరిస్థితి. ఊహించని ఫలితాలతో టీడీపీ ఈ జిల్లాలో కూడా జోష్ పెంచిందని చెప్పవచ్చు.ఇలాంటి తరుణంలో తాజాగా వైసీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి ఏకంగా కడప టీడీపీ నేతలకు మద్దతుగా ఓ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్ ద్వారా తాను టీడీపీ నేతలకు మద్దతుగా ఉన్నట్లు చెప్పకనే చెప్పారు విజయసాయిరెడ్డి.ఇంతకు ఆ ట్వీట్ లో ఏముందంటే.. మాజీ సీఎం జగన్ స్వంత జిల్లా కడప జిల్లా టీడీపీ నేతలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇటీవల ప్రకటించిన తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీలో కూడా చోటు దక్కలేదని, అలాగే నామినేటెడ్ పదవుల్లో సరిపడా పదవులు లేకపోవడంతో కడప నుండి టీడీపీ, స్వంత నేతలను కూడా పక్కన పెడుతోందని విమర్శించారు. అంతేకాదు రెండు సంవత్సరాలలోగా తప్పనిసరిగా కడప టీడీపీ నేతలందరూ వైసీపీలో చేరడం ఖాయమంటూ జోస్యం చెప్పారు.ఈ ట్వీట్ ను చూస్తే కడప టీడీపీ నేతలను రెచ్చగొట్టే ధోరణిలో వైసీపీ ప్రయత్నిస్తుందని టీడీపీ నేతలు అంటున్నారు. ఎవరికి ఎప్పుడు ప్రాధాన్యత ఇవ్వాలన్నది తమ పార్టీ అధినేత అభిప్రాయమని, ఇటువంటి వాటిని తాము లెక్క చేసేది లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏదిఏమైనా టీడీపీ నేతలపై విజయసాయి రెడ్డి ఆప్యాయత అనురాగాలు చూస్తుంటే, వైసీపీ చూపు కడప వైపే ఉందన్న అభిప్రాయం కూడా వ్యక్తం చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు.

# జగన్ తీరు అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనం

విజయవాడ,మాజీ మంత్రి తీరు చూస్తుంటే అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనంగా ఉందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్లుంది వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరు అంటూ సెటైర్ విసిరారు. అసెంబ్లీ మీద అలగడానికో.. మైకు ఇస్తేనే పోతానని మారం చేయడానికో కాదు ప్రజలు ఓట్లేసింది.. ఇంట్లో కూర్చొని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించింది అని అన్నారు. "మీ స్వయం కృతాపరాధం మిమ్మల్ని ప్రతిపక్ష హోదాకి దూరం చేస్తే... ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతా అనడం మీ అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనం. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్య దేవాలయం. ప్రజల పట్ల, ప్రజా సమస్యల పట్ల అధికార పక్షాన్ని నిలదీసేందుకు ప్రజలు ఇచ్చే గొప్ప అవకాశం" అని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు దిక్కులేదని విమర్శించారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందన్నారు. మహిళలపై దాడులు ఆగడం లేదని... ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని వ్యాఖ్యలు చేశారు. బెల్టు షాపుల దందాను అరికట్టలేదని... ఐదు నెలలైనా ఒక్క ఉద్యోగం భర్తీ కాలేదన్నారు. రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా గొంతుక అయ్యే అవకాశం వైసీపీకి ప్రజలు ఇస్తే... ప్రతిపక్షం ఇస్తేనే వస్తాం అనడం సిగ్గు చేటన్నారు. ప్రతిపక్షం లేకుంటే సభలోనే ప్రజాపక్షం అవ్వాలన్న ఇంగితం కూడా లేకపోవడం బాధాకరమన్నారు.

# అధికారపు అరాచకం...



లక్నో:రౌడీలు, గుండాలు, దొంగలు, దోపిడీదారులు మొదలైన వారు అరాచకాలకు పాల్పడటం మనకేమీ ఆశ్చర్యం అనిపించదు. ఎందుకంటే వాళ్లలా చేస్తారు కాబట్టే రౌడీలు, గుండాలు అంటున్నాం, అసలైన ఆశ్చర్యం ఏమంటే, రాజ్యాంగం ప్రకారం ఎన్నికయిన ప్రజా ప్రభుత్వాలనబడే సర్కార్లే అరాచకానికి దిగితే, ఇంకా ఎవరిదగ్గర మొరపెట్టు కుంటారు ప్రజలు! అయితే చివరికి అత్యున్నత న్యాయస్థానం దగ్గర మొరపెట్టుకోక తప్పలేదు బాధితులకు. అహం కారంతో అనేక దుర్మార్గాలకు పాల్పడతారు నియంతలు. అలాంటి అహంకారం ప్రజాస్వామిక ప్రభుత్వాలు ప్రదర్శిం చటమే నేటి విడ్డూరం! ప్రభుత్వాలు ప్రజలవైపు నుండి ఆలోచిస్తాయని సాధారణంగా మనం భావిస్తాము. రాజ్యాంగ హక్కులను, విలువలను పాటిస్తాయనీ అనుకుంటాం! కానీ అవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వాలు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నాయి? ప్రభుత్వాలలో మతవివక్షతలు, కులవివక్షతలు, కార్పోరేట్లకు వంతపాడే వివక్షతలు పెరిగిపోయి, ఈ అరాచకానికి పాల్పడుతున్నాయి.అందుకు నిలువెత్తు ఉదాహరణే ఈ మధ్య సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికలు, తీర్పులు. గత కొంతకాలంగా ఉత్తరప్రదేశ్‌లో 'బుల్డోజర్‌రాజ్' పరిపాలన సాగుతోందన్న విషయం అందరికీ తెలుసు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని, ముఖ్యంగా ముస్లిం సమూహాన్ని, హక్కులకోసం పోరాడేవారిని టార్గెట్ చేసుకుని, వారి ఇండ్లను బుల్డోజర్‌లతో కూలగొట్టడం, అక్రమంగా నిర్మించారని ఆరోపించడం జరుగుతోంది. 2019లో ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్ గంజ్‌కు చెందిన మనోజ్ తిబ్రెవాల్ ఇంటిని కూడా ఇలానే కూలగొట్టింది ప్రభుత్వం. దానిపై అతను కోర్టుకు వెళ్లాడు. విచారించిన ధర్మాసనం సంచలనమైన వ్యాఖ్యలు చేసింది. 'ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. రాత్రికి రాత్రే బుల్డోజర్లు పంపి అక్రమ నిర్మాణాల పేరుతో ఇల్లును కూల్చివేయడం తప్పు' అని స్పష్టం చేసింది. కేవలం 3.7 చదరపు మీటర్ల స్థలాన్ని ఆక్రమించారన్న కారణంతో ఇల్లును కూల్చివేసి నందుకు, బాధితునికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. రోడ్డు విస్తరణ సమయంలో ఎలా వ్యవహరించాలో అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకాలను జారీ చేసింది. యూపీలో ఇప్పటికి 123 ఆవాసాలను కూల్చివేశారని, నోటీసు లేకుండా కేవలం చాటింపు వేసి కూల్చడం అహంకారంతో చేసిన చర్య తప్ప చట్టబద్ధమైనది కాదని, ఇది పూర్తి అరాచకమని వ్యాఖ్యానించింది.ఇది ఇండ్లను కూల్చడం కాదు, రాజ్యాంగపు హక్కులను కూల్చడం. విలువల్ని కూల్చడం. ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూల్చడం. ఈ కూల్చుడాల వెనుక మతం, కులం ఉండటం మరింత ఘోరమైన విషయం. పై విషయాలతో పాటుగా సుప్రీంకోర్టు మరో అంశంపైనా తీవ్రంగానే స్పందించింది. గోరక్షణ పేరుతో మూక హత్యలకు పాల్పడుతున్న దళాలపై ఆందోళన వ్యక్తం చేసింది. వీరి దాడులు పెరుగుతున్న రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏమి చేస్తున్నాయని నిలదీసింది. మోడీ అధికారంలోకి వచ్చాక, బీఫ్ తింటున్నారనే నెపంతో అక్లాక్‌ను చంపిన సంఘటన నుండి, వివిధ రాష్ట్రాలలో గోరక్షణ పేరుతో దాడులకు తెగబడటం, అరాచకం సృష్టించటం బాగా పెరిగిపోయింది. ఇది కూడా 75 ఏండ్లుగా పెంపొందించుకున్న లౌకిక విలువల్ని కూల్చడమే. ఆహారపు హక్కులను ధ్వంసం చేయటమే. ప్రభుత్వాలు ప్రజల హక్కులను, ప్రాణాలను కాపాడాల్సి ఉండగా, దానికి భిన్నంగా ప్రాణాలు తీసే పాత్రను పోషించడం, హక్కులను కాలరాయడం చాలా దారుణమైన విషయం. డబుల్ ఇంజన్ సర్కార్‌ల పేరుతో బుల్డోజర్‌రాజ్ కొనసాగటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. అప్పుడప్పుడైనా కోర్టులు ఇలా హెచ్చరించినపుడే ప్రభు త్వాల నిజస్వరూపాలు బయటపడుతున్నాయి. ఈ హెచ్చరికలను ప్రభుత్వాలు, నాయ కులు పట్టించుకుం టాయా లేదా అనేది తేలాల్సి ఉంటుంది.మన తెలంగాణలో కూడా ఆక్రమణల పేరుతో ఇండ్లను కూల్చేటప్పుడు ముందుగా నోటీసులివ్వడం, నిబంధనలు పాటించడం చేయాలి. పేదవారికి ప్రత్యామ్నాయా న్నీ చూపించాలి. ఏదిఏమైనా అహంకారంతో అరాచకంగా వ్యవహరించే ప్రభుత్వాల తీరును ప్రధాన న్యాయస్థానం గుర్తించి నిలదీయడం, హెచ్చరించడం మంచి పరిణామం. ఈ విషయాలను ప్రజలు అవగాహన చేసుకుని, అలాంటి ప్రభుత్వాలను

# గత పాలనలో జరిగిన విధ్వంసంతోనే ఇప్పుడు కష్టాలు

అమరావతి,2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్ని రంగాలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విధ్వంసంతోనే వైసీపీ పాలన నడించిందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లోనూ విధ్వంసం చోటు చేసుకుందన్నారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ పతనమయ్యేలా చేశారని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. గత ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలను అమలు చేసిందని వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రజలు అపురూపమైన తీర్పు ఇచ్చారన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో చీకటి దశ నడిచిందంటూ మంత్రి కామెంట్స్ చేశారు. వైసీపీ పాలన విధ్వంసంతోనే ప్రారంభమైందన్నారు. రాష్ట్ర బ్రాండ్ విలువను దెబ్బతీశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రానీయకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలను దారి మళ్లించారని ఆరోపించారు. అలాగే కార్పొరేషన్ల నిధులను కూడా మళ్లించారన్నారు. గత ప్రభుత్వంపై గుత్తేదారులకు నమ్మకం పోయిందని.. గత ప్రభుత్వంలో పరిమితికి మించి అప్పులు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజాస్వామ్య గొంతులను అణచివేసిందని.. వైసీపీ సర్కార్ నిర్వాకంతో ఆర్థిక గందరగోళ పరిస్థితులు నెలకొన్నయాన్నారు. పతనం అంచున రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిలుచుందన్నారు. రాష్ట్ర ప్రగతి పునర్‌నిర్మాణం నేటితరం చేతుల్లో ఉందన్నారు. ప్రభావవంత పాలనే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల వల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడిందని విమర్శించారు. సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని.. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సలహాలను పట్టించుకోలేదన్నారు. ఏళ్ల తరబడి పోలవరం ప్రాజెక్టును గాలికొదిలేశారని మండిపడ్డారు. ఏపీ అభివృద్ధి కుంటుపడకుండా చూస్తామని వెల్లడించారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బడ్జెట్ రూపొందించినట్లు తెలిపారు. పట్టణాల్లో 204, గ్రామీణ ప్రాంతాల్లో 158 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామన్నారు. వీలైనంత త్వరగా పోలవరం పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రపంచస్థాయి నగరంగా అమరావతి నిలవనుందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు.

# గత్తర రాజకీయం చేస్తున్న బిఆర్ఎస్,వైకాపా!




హైదరాబాద్,తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌కు ఇప్పుడు పార్లమెంట్‌లోనూ ప్రాతినిధ్యం లేదు. అలాగే అసెంబ్లీలో విపక్షంగా తగినంత బలంగా ఉన్నా..నిమర్మనాత్మక వైఖరి మాత్రం అవలంబించడం లేదు. ఎపిలో అసెంబ్లీకి ఎన్నికైన వైకాపా నేతలు జగన్ సహా, ఆయన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు రాబోమని భీష్మించారు. ఎపిలో 11నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగనుండగా, విపక్ష హోదా లేదు కనుక అసెంబ్లీకి రానని జగన్ ప్రకటించారు. ఇంతకన్న దౌర్భాగ్యం మరోటి ఉండదు. ఆయనది వితండవాదం తప్ప మరోటి కాదు. అధికారం లేకపోతే ప్రజాసమస్యలపై పోరాటం చేయలేమని వారు చెప్పకనే చెప్పారు. తెలంగాణలో కూడా కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు. వీరికి అధికారం, అక్రమ సంపాదనలే ముఖ్యమని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇకపోతే విపక్షమంటే అధికార పక్షాన్ని విమర్శించడం మాత్రమే అన్న సూత్రం మీద ఎపిలో వైకాపా, తెలంగాణలో బిఆర్ఎస్ నడుచుకుంటున్నాయి. ఏ పనైనా చేయని ..అందులో విమర్శలు చేయడం, గుడ్డుమీద వెంట్రుకలు ఏరడం నేర్చుకున్నాయి. ఇంతటి బాధ్యతా రాహిత్య విపక్షాలను చూసివుండం. అధికారంలో ఉంటే ప్రజలతో సంబంధం లేకుడా ఈ రెండు పార్టీలు పాలన చేశాయి. ప్రజలను దగ్గరకు రాకుండా కంచెలు వేసుకున్నాయి. ఇనుప గడీలను కట్టుకున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అందినకాడికి దోచుకున్నాయి. రాష్ట్రలను అప్పుల కుప్పగా చేశాయి. ఇప్పుడు అధికారం పోవడంతో ఈ రెండు పార్టీల నేతలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే తమదే అధికారం అని తొడలు చరుస్తున్నాయి. వీరి కోసం ఇప్పుడు ఎన్నికలు పెట్టాలేమో. ఎన్నికల సంఘం కూడా వీరి గురించి ఆలోచిస్తే మంచిది. నిజానికి పార్లమెంట్ ఎన్నికల ముందు తెలంగాణలో బిఆర్ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదని సర్వేలన్నీ తెలిపాయి. అనుకున్నట్టుగానే ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు దక్కలేదు. అయినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. చేసిన అప్పుల గురించి మాట్లాడరు. తప్పుల గురించి మాట్లాడరు. జాతీయ పార్టీగా ప్రకటించుకున్నా..కనీసం ఓ నాలుగైదు ఎంపి సీట్లు గెలిచివుంటే పార్టీ మనుగడ సాధ్యం అయ్యేది కానీ అలా జరగేలదు. బిఆర్ఎస్ పార్టీలో నిరంకుశ విధానాలు తట్టుకోలేకపోతున్నామని అనేకులు ఇప్పటికే ప్రకటించారు. అందుకేనేమో ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. పలువురు ఎమ్మెల్యేలు జారుకున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేటీఆర్ రంగంలోకి దిగారు. హరీష్ రావు, కెటిఆర్ ఇద్దరూ రోజూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తూ..ప్రజల్లో ఉండడానికి పనిచేస్తున్నారు. రైతుల పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని చెప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు. రైతులను పరామర్శించే కార్యక్రమాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీతోనే రైతులకు లాభం జరుగుతుందని చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం కానరావడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టమని విమర్శలు చేస్తోంది. మాతో 20మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీరాలు పలుకుతుంది. తనముందున్న అన్ని అస్త్రాలను ఉపయోగించాలని చూస్తున్నారు. అయితే ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. రేవంత్ ప్రభుత్వం కూలుతుందని, అధికారులు జాగ్రత్త అని కెటిఆర్ హెచ్చరిస్తున్నారు. ఎపిలో కూడా జగన్ సరిగ్గా ఇంలాటి హెచ్చరికలే చేస్తున్నారు. ఇరువురి ఎజెండా ఒక్కటే కావడంతో ఒకే రకమైన లెక్కలతో ముందుకు పోతున్నారు. దీనికితోడు సిఎం రేవంత్‌రెడ్డి తీరుపై సానుకూల దృక్పథం రోజురోజుకూ బలపడుతోంది. అన్నింటికి మించి దొరల పానలకు దూరంగా ఉన్నామన్న భరోసా ప్రజల్లో వచ్చింది. అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు చెక్ పెట్టిన కాంగ్రెస్ ..మళ్లీ కోలుకోకుండా ఉండేందుకు ప్రజల్లోకి వెళ్లి అనేక కార్యక్రమాలు చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మరింతగా దిగజారింది. ఆ పార్టీ మరో నాలుగేళ్లు ఓపిక పట్టేందుకు సిద్దంగా లేదు. ఎపిలో జగన్ కూడా అధికారం మరిగిన కారణంగా అధికారం లేకుండా ఉండలేక పోతున్నారు. అవినీతిలో కూరుకుపోయిన గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా.. ఊడుతుందా అంటూ... పొలిటికల్ మైండ్ గేమ్‌తో అధికార కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేందుకు బిఆర్ఎస్ నేతలు కామెంట్స్ చేస్తున్నారు. ఉద్యమం నాటి కెసిఆర్‌ను చూస్తారని కెటిఆర్ అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండదని, ఆ పార్టలో గందరగోళం ఏర్పడుతుందని అంటున్నారు. రాష్ట్రంలో గందర గోళ రాజకీయాలు ఉంటాయని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలే సూచనలు ఉన్నట్లు చెపుతున్నారు. 104 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే బీజేపీ తన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేసిందని, 64 స్థానాలున్న కాంగ్రెస్ ను కూల్చడం పెద్ద కష్టం కాదని కేసీఆర్ సూత్రీకరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు లాంటి నేతలు కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని, రేవంత్ రెడ్డి బీజేపీలో చేరడం ఖాయమని ప్రచారం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే పార్టీ క్యాడర్ ను , లీడర్లను కాపాడుకోవడం అనే వ్యూహంతోనే బీఆర్ఎస్ నేతలు ఈ మైండ్ గేమ్ కు సిద్ధమయినట్లు తెలుస్తోంది.

# అవివేకం, అజ్ఞానం... జగన్ పై షర్మిల నిప్పుల వర్షం!



అమరావతి,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నేడు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. అయితే... ఇంత ముఖ్యమైన సెషన్స్ కి వైసీపీ గైర్హాజరైంది. దీంతో వైసీపీ అధినేత జగన్ పై షర్మిల నిప్పులు చెరిగారు. అవివేకం, అజ్ఞానం అంటూ విరుచుకుపడ్డారు. అవును... అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్ష పార్టీ అయిన తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని.. ప్రజాసమస్యలపై గొంతెత్తుతామనే భయంతోనే ఇలా వ్యవహరిస్తున్నారని.. అందువల్ల అసెంబ్లీ సెషన్స్ కు హాజరు కాకూడదని వైసీపీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల స్పందించారు. ఈ సందర్భంగా స్పందించిన షర్మిల... అసెంబ్లీకి వెళ్లకూడదనే జగన్ నిర్ణయం.. అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్లుగా ఉందని అన్నారు. అసెంబ్లీ మీద అలగడానికో, మైకు ఇస్తేనే పోతానని మారాం చేయడానికో కాదు ప్రజలు ఓట్లేసిందని.. ఇంట్లో కూర్చొని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు మిమ్మల్ని గెలిపించిందని అంటూ జగన్ పై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా... స్వయంకృతాపరాధమే జగన్ కి ప్రతిపక్ష హోదా దూరం చేస్తే, ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని అనడం కచ్చితంగా అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనం అని షర్మిల అన్నారు. ఈ సందర్భంగా ప్రజల తరుపున కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి పలు అవకాశాలున్నాయంటూ వాటినీ ప్రస్థావించారు. ఇందులో భాగంగా... కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు దిక్కు లేదు.. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు నోచు కోలేదు.. మహిళలపై దాడులు ఆగడం లేదు.. బెల్టు షాపుల దందాను అరికట్ట లేదు.. ఐదు నెలలు అయినా ఒక్క ఉద్యోగం భర్తీ కాలేదు.. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది.. ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఉంటే.. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా గొంతుకయ్యే అవకాశం వైసీపీకి ప్రజలు ఇస్తే.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం సిగ్గు చేటని.. ప్రతిపక్షం లేకుంటే సభలోనే ప్రజాపక్షం అవ్వాలనే ఇంగితం కూడా లేకపోవడం బాధాకరం అని షర్మిల విమర్శించారు. ఈ సందర్భంగా చరిత్రను ప్రస్థావించారు. ఇందులో భాగంగా... 1994లో కాంగ్రెస్ పార్టీ 26 సీట్లకే పరిమితం అయినా.. ఉన్న సభ్యులతోనే సభలో ప్రజల పక్షంగా నిలబడిందని.. ఎన్నో సమస్యలపై నాటి టీడీపీ ప్రభుత్వానికి చుక్కలు చూపించిందని తెలిపారు. అదేవిధంగా 2014లో కేంద్రంలో 44 సీట్లకు.. 2019లో 52 సీట్లకే పరిమితం అయినా రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు ప్రజా సమస్యలపై గొంతెత్తారని అన్నారు. కాబట్టి... ఇప్పటికైనా పిచ్చితనాన్ని పక్కనపెట్టి అసెంబ్లీకి వెళ్లాలని.. కూటమి నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టాలని.. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే మొత్తం రాజీనామాలు చేయాలని.. అప్పుడు ఇంట్లో కాకపోతే, ఎక్కడైనా కూర్చుని తాపీగా మాట్లాడుకోవచ్చని జగన్ కు షర్మిల తనదైన శైలిలో సూచించారు.

# హోం శాఖ కష్టాలు తీరాయ్.. ఏకంగా 8 వేల కోట్ల కేటాయింపు!



ఏపీ హోం శాఖ కష్టాలు దాదాపు తీరాయనే చెప్పాలి. ఈ శాఖ పరిధిలో ఏ కార్యక్రమం చేపట్టాలన్నా.. ఆర్థిక సమస్యలు వెంటాడేవి. ముఖ్యంగా పోలీసులకు జీతాలు, ఖర్చులు, సైబర్ నేరగాళ్లను అరికట్టేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటివి హోం శాఖను దాదాపు చేతులు కాళ్లు కట్టేసినట్టు అయింది. ఇలాంటి కీలక సమయంలో కూటమి సర్కారు హోం శాఖకు పెద్ద పీట వేస్తూ.. బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం గమనార్హం. తాజాగా ప్రవేశ పెట్టిన కూటమి సర్కారు స్వల్ప కాలిక బడ్జెట్‌లో హోం శాఖకు 8495 కోట్ల రూపాలను కేటాయించింది. దీనిలో పోలీసులకు, ఇతర ఉద్యోగులకు, విపత్తుల నిర్వహణ శాఖకు బకాయి ఉన్న రూ. 6 వేల కోట్లను విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడింది. దీంతోపాటు .. 2 వేల కోట్లతో అధునాతన పరికరాలను కొనుగోలు చేసేందుకు, పోలీసు స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూడా మార్గం సుగమం అయింది. వైసీపీ హయాంలో కేవలం 800-1000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిన విషయం తెలిసింది. అది కూడా ఏడాది మొత్తానికి కావడం అప్పట్లో వైసీపీ సర్కారు తీరుపై హోం శాఖ వర్గాల్లోనే విస్మయం వ్యక్తమైంది. ఫలితంగా పోలీసులకు ఇవ్వాల్సిన టీఏ, డీఏలను బకాయి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ, ఇప్పుడు మేలిమి కేటాయింపుల ద్వారా.. పోలీసుల పనితీరును మెరుగు పరచడంతోపాటు.. వారికి కావాల్సిన సదుపాయాలను, బకాయిలను కూడా చెల్లించేందుకు అవకాశం ఏర్పడింది. తద్వారా రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలను సమర్థవంతంగా కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చినట్టు అయింది. ఇటీవల రెండు మూడు సందర్భాల్లో పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది బకాయిలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావ డం తోపాటు.. అధునాత సామగ్రి కొనుగోలు ప్రతిపాదనలు కూడా ఇచ్చారు. అయితే.. సాధార ణంగా ఈ విషయాలను ప్రభుత్వాలు పక్కన పెడుతుం టాయి. కానీ, తాజా బడ్జెట్‌లో కూటమి సర్కారు హోం శాఖ డిమాండ్లకు పెద్దపీట వేయడం గమనార్హం. దీంతో వారికి గతంలో ఎన్నడూ లేని విధంగా 8 వేల పైచిలుకు కోట్ల రూపాయలను కేటాయించడం ద్వారా రాష్ట్రంలో శాంతి భద్రతలకు, పోలీసు వ్యవస్థకు సర్కారు పెద్ద పీట వేసిందనే చెప్పాలి.

# మహాయుతి కూటమి విష ప్రచారం



న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని బిజెపి నేతృత్వంలోని మహాయతి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ద్వేషపూరిత, విషపూరిత ప్రసంగాలు చేస్తోందని, రాష్ట్రంలో మతసామరస్యానికి భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. మహాయతి కూటమి చేస్తోన్న ప్రచారం వారి బుద్ధిహీనతను తెలియజేస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన తాజాగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'బిజెపి నేతృత్వంలోని మహాయతికి ఎన్నికల ప్రచారంలో ఒకే ఒక అజెండా ఉంది. కేవలం మత ప్రాతిపదికన సమాజాన్ని ఏర్పాటు చేయడం. రాష్ట్రంలో మత సామరస్యాన్ని భంగపరచడం మాత్రమే ఈ కూటమికి ఉన్న అజెండా అని అన్నారు. ద్వేషాన్ని, విషాన్ని నింపేలా ఈ కూటమి ప్రచారం చేస్తోంది. కానీ మహారాష్ట్ర ప్రజలు నవంబర్ 20న ఈ తరహా ప్రచారాన్ని నిర్ణయాత్మకంగా తిరస్కరిస్తారు' అని రమేష్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మహా వికాస్ అఘాడీ ప్రజా సమస్యలపై ప్రచారం సాగిస్తోంది. రైతులు, మహిళలు పడే బాధలపైనా, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల పైనా, కార్మికుల అభద్రతపైనా మహా వికాస్ అఘాడీ ప్రచారం చేస్తోంది. అలాగే నిరుద్యోగుల కోసం లక్షలాది ఉద్యోగాల కల్పన, నీటి సంక్షోభం, ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు సామాజిక న్యాయం కోసం, మహారాష్ట్రలో భారీ పెట్టుబడి ప్రాజెక్టులు లేకుండా చూపిన వివక్షపైనా తదితర అంశాలపై ఎంవిఎస్ కూటమి అజెండాలుగా ఉన్నాయి అని రమేష్ తెలిపారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 20వ తేదీన జరగనున్నాయి. మహయతి కూటమికి, మహా వికాస్ అఘాడీ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఎన్నికల ఫలితాలు నవంబర్ 23న వెలువడనున్నాయి.

# అన్నదాతలకు చుక్కలు చూపిస్తున్న పాలకులు



హైదరాబాద్, ఆరుగాలం క ష్టపడి కష్టనష్టాలకోర్చి పంట పండిస్తే చివరిలో అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏదైనా పంటలు అమ్ముకోవడం దుర్లభంగా మారుతోంది. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాలంటూ ఊదరగొట్టారు. మిల్లర్లకు మద్దతుగానే నిలిచారు. ఇప్పుడు అదే పరిస్తితి ఉంది. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. వరి కావచ్చు, పత్తి, సోయా, కంది ఇలా ఏ పంటయినా రైతులు చిత్తవ్వాల్సిందే. వానాకాలంలో పంటలు బాగా పండి దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఈసారి చేసిన అప్పులైనా తీరుతాయని అనుకుంటున్న రైతులకు ఆశాభంగమే ఎదురవుతోంది. ఓ పక్క పంట చేతికొచ్చే సమయంలో అకాలవర్షాలు దెబ్బతీస్తుం టే..మరోపక్క మిల్లర్లు సిండికేట్‌గా మారి మద్దతు ధరకు మంగళం పాడుతున్నారు. మద్దతు ధరతో పాటు ఐదువందల రూపాయలు బోనస్ ఇస్తామని ప్రభుత్వం అంటున్నా రైతుకు మద్దతు దక్కడం లేదు. వరికోతలు ప్రారంభమైన తొలినాళ్ళలో సన్నరకం వడ్లు క్వింటా రూ. 2500 నుండి రూ. 2600 వరకు ధర పలికింది. కోతలు ముమ్మరంగా జరుగుతుండటం.. వందల ట్రాక్టర్లలో ధాన్యం మిల్లులకు వస్తుండటంతో మిల్లర్లు ఒక్కసారిగా ధరను తగ్గించేశారు. నల్లగొండ జిల్లా,మిర్యాలగూడ ప్రాంతంలోని మిల్లర్లు అంతా సిండికేట్‌గా మారి మిల్లులకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయకుండా కృత్రిమ కొరత సృష్టిస్తూ మద్దతు ధరను తుంగలో తొక్కుతున్నారు. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు రోడ్డెక్కారు. అయినా ప్రభుత్వ అధికారులు, మంత్రులు చర్యలకు దిగలేదు. మంత్రులు మాటలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. సన్నరకం వడ్లు మిల్లులకు ఇబ్బడిముబ్బడిగా వస్తుండటాన్ని ఆసరాగా తీసుకున్న మిల్లర్లు ధరను పడేశారు. ఇప్పుడు క్వింటా ధర కేవలం రూ. 2100 నుండి రూ. 2200 రూ పాయల వరకే పలుకుతోంది. అన్నదాతలు తప్పనిసరి స్థి తుల్లో వచ్చినకాడికి చాలు అన్నట్లుగా అమ్ముకుంటున్నారు. కానీ మిల్లర్లు అంతా ఒక్కటై అసలు కొనుగోళ్ళే నిలిపివేశారు. దీంతో వందల ట్రాక్టర్లు మిల్లుల ముందు బారులు తీరాయి. మిర్యాలగూడ మిల్లుల వద్ద ట్రాక్టర్లను రోడ్లపై పెట్టి ధర్నా చేశారు. నార్కట్‌పల్లి టు అద్దంకి.. మిర్యాలగూడ టు హుజూర్‌నగర్ రహదారిపై గంటపాటు రాస్తారోకో చేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించడంతో పాటు మద్దతు ధర పెట్టాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకొని రైతన్నలకు నచ్చచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం మిల్లుల్లో ధా న్యం కొనుగోలు ప్రారంభించడంతోధర్నాను విరమించారు. నిజానికి ప్రభుత్వంలో ఎవరు ఉన్నా పక్కాగా ధాన్యం కొనుగోళ్లు సాగడం లేదు. తేమ శాతం 17లోపు ఉండాలనే నిబంధన పెట్టింది. సన్నధాన్యం కోసింది కోసినట్లుగానే పచ్చివడ్లు వస్తుండటంతో కొనుగోలు కేంద్రాల్లో వాటిని కొనుగోలు చేయడంలేదు. దీంతో అన్నదాతలు కొంతరేటు తక్కువైనా మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకు ఏఒక్క సెంటర్‌లో కూడా సన్నధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదు. కానీ అధికారులు ట్రక్‌షీట్లు మాయచేసి కొనుగోలు చేసినట్లుగా బోనస్ కొట్టేసే ప్రమాదం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇకమరోవైపు పత్తి రైతులదీ ఇదే దారి. మద్దతు ధరలు దక్కడం లేదు. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్టు జిన్నింగ్ మిల్లులు ప్రకటించాయి. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఇకపై పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘం ప్రకటించింది. ఆదివారం సమావేశమైన సంఘం నేతలు పత్తి కొనుగోళ్ల నిలిపివేతకు సంబంధించి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సీసీఐ సీఎండీకి లేఖ రాశాయి. పత్తి కొనుగోలులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అమలు చేస్తున్న అడ్డదిడ్డ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు లేఖలో పేర్కొన్నాయి. ఈ సీజన్‌లో తెలంగాణలో రైతుల నుంచి పత్తి కొనుగోలుపై సీసీఐ ఎన్నడూ లేని విధంగా కొర్రీలు పెడుతున్నది. రెండు రోజుల క్రితం సీసీఐ తీసుకున్న నిర్ణయం ఇటు మిల్లులకు, అటు రైతులకు శరాఘాతంగా మారింది. మొన్నటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 318 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేసేది. క్లస్టర్ల వారీగా విభజించి మొదటి మిల్లులో సామర్థ్యం మేరకు కొనుగోళ్లు పూర్తయిన తర్వాతే మరో మిల్లులో కొనుగోళ్లు ప్రారంభిస్తుంది. అప్పటి వరకు మిగిలిన మిల్లుల్లో ఎలాంటి కొనుగోళ్లు ఉండవు. ఈ విధం గా నల్గొండ జిల్లాలో మొత్తం 23 జిన్నింగ్ మిల్లులు ఉండగా కేవలం 7 మిల్లుల్లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. దీంతో మిగిలిన మిల్లుల పరిధిలోని రైతులు ఈ ఏడు మిల్లులకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తద్వారా రైతులపై రవాణా భారం పడుతున్నది. ఈ కొత్త విధానాన్ని ఎత్తేయాలని జిన్నింగ్ మిల్లులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే పత్తి కొనుగోలు భారం నుంచి తప్పించుకొనేందుకే సీసీఐ ఉన్నతాధికారులు ఇలాంటి కుట్రలు చేస్తున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు నష్టపోయినా పర్వాలేదు.. ప్రభుత్వానికి నష్టం రావొద్దనే విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేది ఎవరు?



హైదరాబాద్,ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఈ నెల ఆరో తేదీతో తో పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ ముగిసింది. అయితే అనుకున్న స్థాయిలో ఓట్లు నమోదు కాకపోవడంతో ఆశావాహులు నిరాశగా ఉన్నారు. అయితే ప్రధానపార్టీలు మాత్రం ఈ ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకునేందుకు కసరత్తు మొదలుపెట్టాయి. ఓటర్లను ఆకర్షించడానికి ఎవరి వ్యూహాలు వారు రెడీ చేసుకుంటున్నారు . ముందుగానే అభ్యర్థులను ఖరారు చేసి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే ప్రచారానికి తెర లేపడానికి పావులు కదుపుతున్నారు.

**త్వరలో ఉత్తర తెలంగాణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక**

ఉత్తర తెలంగాణలో త్వరలో జరగనున్న కరీంనగర్, అదిలాబాదు, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కైవసం చేసుకోవడానికి ప్రధాన పక్షాలు వ్యూహ, ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు మొదలుపెట్టాయి. అధికార కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల వేటలో నిమగ్నం అయ్యాయి. కాంగ్రెస్ ఇప్పటికే ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించింది. అదే విధంగా బిజేపి నలుగురు పేర్లతో అధిష్టానానికి జాబితాను పంపింది. బిఆర్ఎస్ మాత్రం ఎక్కడ కూడా హడావుడి చేయడం లేదు.

**అభ్యర్థుల వేటలో నిమగ్నమైన కాంగ్రెస్, బీజేపీ**

పట్టభద్రుల లో ముప్పై నుండి ముప్పై ఐదు శాతం మాత్రమే ఓటును నమోదు చేసుకోవడంతో.. అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారు నిరాశకు గురవుతున్నారు. ఈ ఎన్నికల్లో పోటీపై బీఆర్ఎస్ క్లారిటి ఇవ్వడం లేదు. ఒకరిద్దరూ నేతలు మాత్రం తాము బరిలో ఉంటామని ప్రచారం చేసుకుంటున్నారు. కాని బీఆర్ఎస్ నాయకత్వం నుండి వారికి ఎలాంటి సిగ్నెల్స్ లేవంట. కాంగ్రెస్, బిజెపి మాత్రం దూకుడు పెంచాయి. ఈ సీటుపై మరింత ఫోకస్ పెట్టి బలమైనా అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి.

**బీఆర్ఎస్‌లో కనిపించని ఎమ్మెల్సీ ఎన్నిక హడావుడి**

ఉత్తర తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బలంగా ఉన్న బీఆర్ఎస్ తర్వాత ఢీలా పడిపోవడతో ఎమ్మెల్సీఎన్నికలలో ఆ పార్టీ వ్యూహం ఏంటో అంతుపట్టకుండా తయారైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకుంది. బిజేపీ సైతం ఉత్తర తెలంగాణలో నాలుగు ఎంపీ సీట్లతో పాటు, ఏడు అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకుని గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల తరువాత జరగనున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నిక కాంగ్రెస్‌కి ప్రతిష్టాత్మకంగా మారింది. ఇంకా షెడ్యూల్ వెలువడని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్, బీజేపీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నా యి. ఇప్పటి నుండే ఈ ప్రాంతం పైనా దృష్టి పెట్టింది.. కాంగ్రెస్ ఉత్తర తెలంగాణ కి చెందిన మంత్రులకు ఎన్నికల బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. అలాగే కేంద్ర మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఇజ్జత్ కా సవాల్‌లా మారిందంట. ఆయనతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ బీజేపీ ఎంపీలకు ఈ ఎన్నికల బాధ్యతలను అధిష్టానం అప్పగించిం దంటున్నారు.

**ఈ నెలాఖరుకి అభ్యర్థుల్ని ఖరారు చేయనున్న కాంగ్రెస్, బీజేపీ?**

ఈ నెలాఖరుకి కాంగ్రెస్, బీజేపీలు ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందంటున్నారు . ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీ స్టాండ్ ఏంటో మాత్రం ఎవరికీ అంతుపట్టడం లేదు. ఇప్పటివరకు ఎమ్మెల్సీ ఎన్నికకి సంబంధించి బీఆర్ఎస్ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. అయితే కాంగ్రెస్‌ని ఎదుర్కోవాలంటే తమకే సాధ్యమని స్థానిక గులాబీ నేతలు జబ్బలు చరుచుకుంటున్నారు . పోటీలోఎలాంటి డౌట్ లేదు , కదన రంగంలో నిలవడం గ్యారంటీ అని ప్రచారం చేసుకుంటున్నారు. మరి ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు ఎవరి తలరాత ఎలా రాస్తారో చూడాలి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com